క్లుప్తంగా

పెండింగ్ బకాయిలు త్వరగా ఇవ్వాలి



ముప్పాళ్ళ: ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలన్నీ త్వరగా ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు ముప్వా సురేష్, భాగేశ్వరిదేవి కోరారు. మండలంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) సభ్యత్వ క్యాంపెయిన్ సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలను అందించి ఉద్యోగమిత్ర ప్రభుత్వంగా ఉండాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు మంగినపూడి శ్రీనివాసరావు, కొమిరిశెట్టి విజయ్‌కుమార్, షేక్ ముజీబ్, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మీశారద, కమలపాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బెల్లంకొండ: బెల్లంకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ ఏఈ డి.పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. బెల్లంకొండ సబ్‌స్టేషన్ 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెంకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి మృతి



సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు పేరుపోగు సుగుణ (72) సోమవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్తెనపల్లిలోని 30వ వార్డులో మృతి చెందారు. మృతురాలికి భర్త రమణరాయ్, ఒక కుమారుడు, ఇరువురు కుమార్తెలుండగా, కుమారుడు గతంలో కరోనా సమయంలో మృతి చెందాడు. ఇరువురు కుమార్తెలకు వివాహమైంది. పార్టీలో చురుగ్గా పని చేసిన సుగుణ మృతి పార్టీకి తీరనిలోటును మిగిల్చింది. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు సోమవారం సుగుణ మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డు అంబేడ్కర్ నగర్‌కు చెందిన బొమ్మల రాజు (51) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేలు సాయం అందించారు. అలాగే వార్డు పెద్దలు మరో రూ.10 వేలు సేకరించారు. మొత్తం రూ.15 వేలు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు ఉన్నారు.

విద్యా వికాసమే ప్రభుత్వ లక్ష్యం



సత్తెనపల్లి: బాలబాలికల విద్యా వికాసమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ మంజూరు చేసిన రూ.1.67 కోట్లతో సత్తెనపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాల బాలికల అదనపు వసతిగృహం, సత్తెనపల్లి కేజీబీవీలో కంప్యూటర్ రూమ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, లైబ్రరీ కోసం రూ.60.10 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారం, సౌకర్యాలు వాడుకుని బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వసతి గృహం నిర్మించేందుకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.1.58 కోట్లతో వసతి గృహంతో పాటు భోజనశాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన వెంట తహసీల్దారు సరోజని, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో-1, 2 మల్లిఖార్జునశర్మ, నరసింహారావు, టీడీపీ మండల కన్వీనర్ నరసింహారవు, ప్రిన్సిపాల్ జోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



సైడ్‌వాల్స్ లేక పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



బ్రిడ్జిపై నడుచుకుంటూ వస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ఆ బ్రిడ్జిపై ప్రయాణం..

క్షణక్షణం భయం

- దేచవరం వద్ద చిలకలూరిపేట మేజర్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన
- ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు
- బ్రిడ్జిపైగా వెళ్లేందుకు భయపడుతున్న విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు

నకరికల్లు: శిథిలావస్థకు చేరిన వంతెనపై ప్రయాణం చేసేందుకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వంతెన దాటే క్రమంలో హఠాత్తుగా కూలితే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని క్షణక్షణం వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. మండలంలోని దేచవరం గ్రామం సమీపంలో మోడల్‌స్కూల్‌కు దగ్గరలో చిలకలూరిపేట మేజర్‌పై కాలువ నిర్మాణ సమయంలో వంతెనను నిర్మించారు. నరసరావుపేట, నకరికల్లు వైపు నుంచి ఇదే వంతెనపై దేచవరం, కండ్లకుంట, చాగల్లు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఆర్టీసీ బస్సు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలు ధాన్యం, ఎరువుల లోడుతో వెళ్లే వాహనాలు నిత్యం ఇదే వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైపులా ఉన్న ఇనుపగ్రిల్స్ విరిగిపోయాయి. వంతెన కింది భాగంలో పెచ్చులూడి తుప్పుపట్టిన ఇనుప కడ్డీలు కూడా బయటపడ్డాయి. వంతెనకు ఇరువైపులా రోడ్డు మలుపులు ఉండడంతో దగ్గరకు వచ్చేవరకు కన్పించే పరిస్థితి లేదు. ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ఆ వంతెనపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, పాదచారులు భయపడుతున్నారు.



చిలకలూరిపేట మేజర్‌పై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిపైనే వెళ్తున్న లారీ

ఆర్టీసీ బస్సు రూటు మార్పు

వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో వంతెనకు ఇవతలి వైపునే ఆర్టీసీ బస్సు నిలిపివేసేవారు. దీంతో ఒకటిన్నర కిలోమీటరుకు పైగా బ్యాగులు మోసుకుంటూ విద్యార్థులు నడిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ప్రత్యామ్నాయం చూడాలని పాఠశాల ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్‌ను, ఆర్టీసీ అధికారులను కోరగా, రూటు మళ్లించి సున్నపుబట్టి, చల్లగుండ్ల మీదుగా దేచవరం ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సును నడుపుతున్నారు. దీంతో దాదాపు 7 కిలోమీటర్లు బస్సు అధికంగా ప్రయాణించాల్సి వస్తుంది. ఇది తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత పరిష్కారం కాదని స్థానికులు వాపోతున్నారు.

బోర్డుతో సరి..



ఎన్నెస్పీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

చిలకలూరిపేట మేజర్‌పై శిథిలావస్థకు చేరుకున్న వంతెనను త్వరగా పునః నిర్మిస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించిన వారవుతారని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా సంబంధిత ఎన్నెస్పీ అధికారులు వంతెన శిథిలావస్థలో ఉంది నెమ్మదిగా వెళ్లండని బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు తప్ప కొత్త వంతెన నిర్మాణానికి పూనుకోలేదు. ప్రైవేటు వాహనాలు నిత్యం ఇదే వంతెనపై ప్రయాణిస్తుంటాయి. రాత్రి వేళల్లో వ్యవసాయ పనులకు వచ్చి వెళ్లే రైతులకు కూడా ప్రమాదం పొంచి ఉంది. అధికారులు కొత్త వంతెనను నిర్మించాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలకు విద్యార్థులు వచ్చే మార్గంలో వంతెన ప్రమాదకరంగా ఉందని, శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చని, విద్యార్థుల క్షేమం కోసం తగిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బ్రిడ్జిని పునః నిర్మించే విషయమే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలని ఎదురుచూస్తున్నాం.

– కె.వేళాంగిణి మేరీ, ప్రిన్సిపాల్, ఆదర్శపాఠశాల, దేచవరం

పునః నిర్మించడం అత్యవసరం



మా గ్రామం చేరుకునేందుకు చిలకలూరిపేట మేజర్‌పై గల వంతెన మీదుగా ప్రయాణం చేయాలంటే ఆందోళన కలిగిస్తుంది. ఆదమరిస్తే అదుపుతప్పి తృటిలో కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. నిత్యం ఇదే రోడ్డు గుండా ప్రయాణం చేయాలి. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెనను నూతనంగా నిర్మించాలి.

– దొండేటి కోటిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు, దేచవరం

హెచ్‌ఎంల సంఘ స్టేట్ కౌన్సిలర్‌గా శ్రీనివాసరెడ్డి



పెదకూరపాడు : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ స్టేట్ కౌన్సిలర్‌గా పల్నాడు జిల్లా నుంచి పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా రెండో సారి ఎన్నికయ్యారు. నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని తిలక్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన పల్నాడు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో శ్రీనివాసరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీసీ చైర్‌పర్సన్ బి.చంద్ర కుమారి, గ్రామ పెద్దలు ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, మునుగోడు హైస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ టి.చంద్రయ్య ఇతర ప్రముఖులు అభినందించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



పెదకూరపాడు (అచ్చంపేట): పురిటి నొప్పులతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో బాధపడుతున్న తల్లి వైద్యశాలకు వెళ్తూ 108లోనే ప్రసవించిన సంఘటన అచ్చంపేట మండలం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన కొమ్మవరపు శ్రావణికి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. సత్తెనపల్లి కమ్యూనిటీ వైద్యశాలకు 108లో తీసుకువెళుతుండగా మార్గంమధ్యలో రెంటపాల సమీపంలో 4:15 గంటలకు నొప్పులు ఎక్కువవడంతో ప్రసవం జరిగిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం సత్తెనపల్లి కమ్యూనిటీ హాస్పిటల్‌లో చేరిప్పించామన్నారు. వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 108 సిబ్బందికి, ఈఎంటీ శరత్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి



స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ సంతకాల సేకరిస్తున్న దృశ్యం



మాదలలో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

క్రోసూరు: ప్రజావేదికల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా, ట్రూ అప్ చార్జీల పేరుతో మోపుతున్న విద్యుత్ భారాలను నిలిపివేయాలంటూ మండల వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందరర్భంగా క్రోసూరు మండల ప్రజావేదిక ఆధ్వర్యంలో మండలంలోని ఆమంచి భవన్ రోడ్డు ఇతర ప్రాంతాలతో పాటు అంబేడ్కర్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. వేదిక కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధపడటం దుర్మార్గమని అన్నారు. తిమ్మిసెట్టి హనుమంతరావు మాట్లాడుతూ మంగళవారం మండల కేంద్రాల్లో ప్రజావేదికల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజావేదిక ప్రతినిధులు రావెళ్ల, పసుపులేటి యదగిరి, వేపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దని వినతిపత్రాలు అందజేత

ముప్పాళ్ళ: ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద సోమవారం వినతిపత్రాల అందజేశారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట ఉరితాళ్లలా మారిపోతున్నాయని, వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను సచివాలయ సిబ్బందికి అందించారు.

5న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గారాజాలయ్య, పఠాన్ సైదాఖాన్, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కందిమళ్ల సాంబశివరావు, మార్పుల వెంకటరెడ్డి, ఇందూరి సత్యనారాయణరెడ్డి, గొల్లప్రోలు నాగేశ్వరరావు, తోట బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, కందిమళ్ల శ్రీనివాసరావు, నూకారపు సాంబశివరావు, తొండపి మస్తాన్, మలినేడి నాగేశ్వరరావు, కూరపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు.. పూడ్చటం మరిచారు

అమరావతి: స్థానిక పట్నంమాలపల్లిలోని పంచాయితీ మంచినీటి కుళాయి కనెక్షన్ కోసం సిమెంట్ రోడ్డును తవ్వి, పూర్తిగా పూడ్చకుండా వదిలివేయటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల వైఎస్సార్‌సీపీ సహాయ కార్యదర్శి తోకల సూరిబాబు ఆధ్వర్యంలో తహసీల్దార్ దానియేల్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వటానికి సిమెంటు రోడ్డును సుమారు 50 చోట్ల రోడ్డు పగలగొట్టడం జరిగిందన్నారు. రోడ్లపై తీసిన గుంతలను పూడ్చడానికి కూడా ఇంటి యజమాని నుంచి రుసుము వసూలు చేశారన్నారు. పంపులు వేసిన తర్వాత రోడ్లపై తవ్విన గుంతలను పూడ్చకుండా వదిలేయటం వల్ల కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ గుంతల వల్ల ద్విచక్ర వాహన ప్రమాదాలు జరగటంతో పాటు వర్షాకాలంలో గుంతలలో నీరు చేరి దోమలకు ఆవాసంగా మారి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్ని మార్లు చెప్పినా పరిష్కారం కాలేదన్నారు. మండల స్థాయి అధికారులు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించామన్నారు. కార్యక్రమంలో దారా ప్రసాద్, సూరిబాబు, పట్నంమాలపల్లి వాసులు పాల్గొన్నారు.

భావనరుషినగర్‌లో ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: ఇంట్లో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని భావనరుషినగర్‌లో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని భావనరుషినగర్‌కు చెందిన కాకుమాను నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పట్టణంలోని బేతేలు చర్చిలో ప్రార్థనకు వెళ్లి తిరిగి రాత్రి 11 గంటలకు వచ్చారు. అప్పటికే ఇంటిలో భద్రపరిచిన రూ.4 లక్షలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. దీనిపై పట్టణ పోలీసులకు నాగేశ్వరరావు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలత

సత్తెనపల్లి: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సీడీపీవో టి.శ్రీలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణ 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బిడ్డ పుట్టి న గంటలోపు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.ప్రమీల, ఎస్.స్వర్ణకుమారి, కె.నాగమణిలు మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగేంద్రం, స్వాతి, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: పుట్టిన బిడ్డకు గంట లోపు ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సోమవారం జరిగింది. సూపర్‌వైజర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే పట్టాలని, తల్లిపాల వలన బిడ్డకు, తల్లికి కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లులకు తల్లిపాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణాధికారి జి.జయలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మీ, కమలాదేవి, ఏఎన్ఎం జి.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లు వెనక్కి తీసుకోవాలి

- 5జీతో కూడిన కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలి
- అన్ని యాప్‌లు రద్దుచేసి ఒకే యాప్‌ను రూపొందించాలి
- సత్తెనపల్లి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన



సీడీపీవో శ్రీలతకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన స్మార్ట్ ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో పనులు సాగడం లేదని, ఇంటర్‌నెట్ అందడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ స్మార్ట్ ఫోన్లు వెనక్కి తీసుకొని కొత్త ఫోన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోమవారం సత్తెనపల్లి ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకుని, ఈ ఫోన్లు తీసుకొని 5జీతో కూడిన కొత్త ఫోన్లు ఇవ్వాలని సీడీపీవో టి.శ్రీలతను కోరారు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సుజాత, అహల్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, ఇంటర్‌నెట్ అందడం లేదని, ఈ కేవైసీ అయిన తర్వాత ఎఫ్‌ఆర్ఎస్ చేయాల్సి వస్తుందని, అది సరిగ్గా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. 2జీ 5 జీ వర్కులు చేయమని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్‌లు సరిగా పనిచేయడం లేదని ఉన్నతాధికారులకు చెబితే పర్సనల్ ఫోన్లు కొనుక్కోమని, పక్కవారితో వైఫై కనెక్ట్ చేయించుకొని వర్కులు చేయాలని చెబితే అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ ఫోన్లతో లబ్ధిదారులకు సర్వీసు చేయలేకపోతున్నామని, ఈ పని చేయని ఫోన్లతో లబ్ధిదారులు కూడా విసిగి వేసారి పోతున్నా రని అన్నారు. 5జీ కొత్త ఫోన్లు ఇవ్వాలని, అన్ని యాప్‌లు రద్దు చేసి ఒక యాప్ కొనసాగించాలని, దానికి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు మద్దతుగా సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ పనికిరాని ఫో న్లు ఇచ్చి పని భారం పెంచి పనులు చేయాలని ఒత్తిడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీల డిమాండ్‌లు నెరవేర్చాలని లేనట్లయితే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీంతో సీడీపీవో శ్రీలత అంగన్‌వాడీల పాత ఫోన్లను వెనక్కి తీసుకున్నారు. అంగన్‌వాడీలు ఆందోళన విరమించారు. అనంతరం సీడీపీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ జడ రాజకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రూ.2.70 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ చక్రవర్తి, ఏవో సుబ్బారెడ్డి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు, ఏవో వేణుగోపాల్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల పరిధిలో పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించి ఫారం-ఓ పత్రాలు లేని రూ.2.70 లక్షలు విలువ చేసే 10 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేశారు. మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, మండల రెవెన్యూ అధికారి కేఎస్ చక్రవర్తి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరెడ్డిలు మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ఎరువుల కట్టల మీద ముద్రించిన ధరలకే కొనుగోలు చేయాలని సూ చించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్ఐ బోస్‌బాబు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం క్రోసూరులోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఏవో వేణుగోపాల్‌తో కలిసి తనిఖీ చేశారు. క్రోసూరులోని జయశంకర్ ఏజెన్సీ, కిసాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఇందులో షాపులోని నిల్వ ఉన్న ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, ఈపీవోఎస్ నిల్వలతో సరిచూశారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారి మాట్లాడుతూ రైతులు అధీకృత డీలర్ వద్దనే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మినా, అనధికారికంగా నిల్వలు ఉంచినా అట్టి వివరాలను స్థానిక వ్యవసాయాధికారికి తెలియజేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం, కృష్ణాష్టమి ఊరేగింపుపై ప్రచారం

సత్తెనపల్లి: ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నరసారావుపేట కమిటీ' ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని గడియార స్తంభం సెంటర్, బస్టాండ్, పోలీస్ స్టేషన్ ఏరియా త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి మాట్లాడుతూ దేవుడే ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు అని, ఊరిలోని వారందరికీ ఎరుక పరచుటకు ఈ ఊరేగింపు చేయడం జరుగుతుందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక, నరసరావుపేట కమిటీ సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, తవిటి అమరలింగయ్య, ఎలిశెట్టి రామాంజనేయులు, చల్లగుండ్ల భాస్కరరావు, కాటం పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com